క్లుప్తంగా

టీఎన్జీవోస్ కమిటీకి అభినందనలు


కమిటీ బాధ్యులను సన్మానిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ నూతన కమిటీని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ సోమవారం కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో కలవడంతో ఆయన కమిటీని సన్మానించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లపు వెంకన్న, రమేష్, కరణ్ సింగ్, లలితకుమారి, తాళ్లూరి శ్రీకాంత్, బూస చంద్రశేఖర్, ఏలూరి హరికృష్ణ, శీలం రాధిక రెడ్డి, రాధా కృష్ణ, యర్రమల శ్రీనివాస్, శంకర్, నెల్లూరి రవి, పవన్ పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజుకు సన్మానం


ఎంపీని సత్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను సోమవారం శ్రీ గాయత్రి సేవా సమితి ప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సమితి క్యాలెండర్లను ఆవిష్కరించారు. సమితి ప్రధాన కార్యదర్శి హరి శ్రీనివాస్, సభ్యులు చంద్రశేఖర్, ప్రణీత్ ఉన్నారు.

గౌడ సంఘం కార్యదర్శిగా సత్యనారాయణ

నేలకొండపల్లి: తెలంగాణ గౌడ సంఘం జిల్లా కార్యదర్శిగా మండలానికి చెందిన జెర్రిపోతుల సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ సోమవారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు... సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ సేవలే లక్ష్యం

ఖమ్మం సహకారనగర్: వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించటమే తమ లక్ష్యమని భారత టెలికం ప్రాధికార సంస్థ సభ్యుడు రావూరి ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ కెఎస్ రామారావు, వివిధ కంపెనీల బాధ్యులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

నేలకొండపల్లి: మండలంలోని మంగ్రాజుపల్లి పంచాయతీ కార్యాలయానికి గ్రామానికి చెందిన అనసూర్యమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు వీరబాబు, రామారావు, దుర్గారావు రూ.30 వేల విలువైన 50 కుర్చీలను సోమవారం అందించారు. ఎంపీఓ శివ, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, తుమ్మా ఉపేందర్, అప్పారావు, కన్నయ్య తదితరులు ఉన్నారు.

చెరువును రక్షించండి..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3, 6 డివిజన్ల మధ్యలో ఉన్న ఖానాపురం చెరువు కబ్జాలతో కుచించుకుపోతుందని చెరువును, చెరువుభూమిని రక్షించాలని సీపీఎం ప్రతినిధి బృందం సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం చెరువును, చుట్టూ పరిసర ప్రాంతాన్ని నాయకులు పరిశీలించారు.

పేదలకు 'భరోసా' అందించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: భూమిలేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఉపాధి హామీ పనితో సంబంధం లేకుండా వర్తింపజేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ పి.శ్రీజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, రమ్య, మండల కార్యదర్శి తిరుపతిరావు, నవీన్ రెడ్డి, వెంకటి, అమరావతి, వెంకటాద్రి, రహీం ఉన్నారు.

కూసుమంచి: రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారు కరుణ శ్రీ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం మండల కార్యదర్శిగా తాళ్లూరి వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. నాయకులు కర్ణబాబు, వెంకన్న, రాజశేఖర్, గురుమూర్తి, సన్మంతరావు, గన్యానాయక్ ఉన్నారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్: వివేకానంద జయంతి వారోత్సవాల సందర్భంగా సోమవారం ఖమ్మం నగరంలోని గట్టయ్యసెంటర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం భవనంలో టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రాఘవరెడ్డి, విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కీలకం కానున్న గ్రామసభ..

లబ్ధిదారుల ఎంపికకు నేటి నుంచి గ్రామసభలు

- హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుకు ఆదేశాలు
- పూర్తయిన సర్వే..
- సాగుకు యోగ్యం కాని 2,500 ఎకరాల గుర్తింపు


సర్వే ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ(ఫైల్)

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు సర్వే శరవేగంగా సాగుతుంది. రైతుభరోసా, కొత్త రేషన్‌ర్డులు...ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాల నిర్మాణ లబ్ధిదారుల ఎంపికలో గ్రామసభ కీలకంగా మారింది. గ్రామసభలో ఆమోదం తప్పనిసరిగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నేటి(మంగళవారం) నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ సభల్లో గ్రామస్తులే నిర్ణేతలుగా నిలవనున్నారు. అభ్యంతరాలు లేకుంటే లబ్ధిదారులను ప్రకటిస్తారు. అభ్యంతరాలు అందితే పెండింగ్‌లో పెట్టే అవకాశం ఉంది. కాగా అర్హత ఉండి పథకాల జాబితాలో పేర్లు రాని వారి కోసం గ్రామాల్లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తోంది. ఆయా పంచాయతీల వద్ద జరిగే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

పేర్లు రాకున్నా దరఖాస్తు ..

రేషన్‌కార్డుల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా వరకు పేర్లు జాబితాలో రాలేదు. దీంతో చాలా మంది ఆందోళన చెందుతున్నారు. జాబితాలో ఉన్న వారి పేర్ల ఆధారంగా అధికారులు సర్వే చేస్తున్నారు. జాబితాలో ఉన్న వారి వ్యక్తిగత ఆస్తులు, భూములపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అర్హులా కాదా అని ధ్రువీకరిస్తున్నారు. కాగా జాబితాలో పేర్లు రానీ వారు ఆందోళన చెందనవసరం లేదని తిరిగి దరఖాస్తు చేసుకొచ్చని అధికారులు తెలిపారు.

భూముల గుర్తింపు..


గుట్టను పరిశీలిస్తున్న అధికారులు

రైతు భరోసాలో పెట్టుబడి సాయం పంపిణీ కోసం క్షేత్ర స్థాయిలో సర్వేలో సాగుకు యోగ్యం కాని భూముల లెక్క తేలుతుంది. సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో వ్యవసాయం, రెవెన్యూ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన బృందాలు క్లస్టర్ల వారీగా పరిశీలించారు. గుట్టలు, రాళ్లు, రప్పలు, ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్ ప్లాట్లకు, భవనాలకు, పరిశ్రమలకు ఇన్నాళ్లుగా పెట్టుబడి సాయం పొందారు. ఐదు రోజులుగా గ్రామాల వారీగా సాగుకు పనికిరాని భూముల జాబితా సిద్ధం చేస్తున్నారు. పాలేరు నియోజకవర్గంలో దాదాపు 2,500 ఎకరాలు సాగుకు పనికిరాని భూములు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. వీటిలో ఖమ్మం రూరల్ మండలంలోనే అత్యధికంగా 1,400 ఎకరాలు, నేలకొండపల్లి మండలంలో 242 ఎకరాలను అధికారులు గుర్తించారు. వీటిని గ్రామ సభల ఆమోదంతో తొలగించనున్నారు.

హెల్ప్‌డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలి



సంక్షేమ పథకాలకు అర్హత ఉండి జాబితాలో పేర్లు లేకుంటే వారు దరఖాస్తు చేసుకోవాలి. వారి కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభల వద్ద పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందనవసరం లేదు. ఒక వేళ డెస్క్‌ను వినియోగించుకోలేకుంటే ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

– యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

గ్రామసభలో ఆమోదం తీసుకుంటాం



రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో సాగుకు యోగ్యమైన భూములను గుర్తించాం. వాటిపై ఆయా గ్రామ సభలలో చర్చించి అమోదం పొందిన తరువాత జాబితా ను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. ఇంకా ఇతర పొలాల పై అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో దరఖాస్తు చేయవచ్చు.

– బి.సరిత, ఏడీఏ, కూసుమంచి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య


వీధుల్లో పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో, విధులపై నిర్లక్ష్యం వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. సోమవారం నగరంలోని 21, 37వ డివిజన్లలో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. 21వ డివిజన్‌లో రోడ్లు, డ్రెయినేజీలు వ్యర్థాలు ఉండడం, చెత్త కుప్పలు కనపడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అలసత్వం ప్రదర్శిస్తున్న జవాన్‌ను సస్పెండ్ చేయాలని అసిస్టెంట్ కమిషనర్‌కు సూచించారు. నగరంలో ఎక్కడ పారిశుద్ధ్యం బాగలేకపోయినా సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సిబ్బందితో సమీక్ష..

కేఎంసీలో శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రతీ రోజు ఉదయం 5.30 గంటల నుండి 11 గంటల వరకు డివిజన్లలో పర్యటించి గార్బేజ్ పాయింట్లను శుభ్రం చేయించాలన్నారు. చెత్త సేకరణ, కాలువలు శుభ్రపర్చడం ప్రతీ రోజు జరగాలని, ఖాళీ స్థలాలను శుభ్రం చేయించుకునేలా యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. సిబ్బందిఎంత మంది హాజరవుతున్నారు, ఎంత మంది గైర్హాజరవుతున్నారనే సమాచారం తనకు ఇవ్వాలన్నారు.

సభల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిశీలన..

నేటి నుంచి నగరంలో మూడు రోజుల పాటుపై నిర్వహించే ప్రజాపాలన వార్డు సభల్లో ఎల్‌ఆర్‌ఎస్ సమస్యలను కూడా పరిశీలిస్తామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను పరిశీలించి అక్కడిక్కడే పరిష్కరించేవి అయితే వెంటనే తమ సిబ్బంది వాటిని పరిష్కరిస్తారని, ఎల్‌ఆర్‌ఎస్ సమస్యలు ఉంటే స్థానికంగా నిర్వహించే వార్డు సభల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో అధికారులను కలవాలని సూచించారు.

రెవెన్యూ ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్

రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో శనివారం ప్రత్యేకంగా రెవెన్యూ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆర్వో శ్రీనివాసరావును కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఈ మేరకు కేఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన వినతలను కమిషనర్ స్వీకరించి పరిశీలించారు. అటు పన్నులు వసూలు చేయడంతో పాటు, సమస్యలను పరిష్కరించే విధంగా రెవెన్యూ డెస్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజాపాలన డెస్క్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. ఈ మేరకు 20 మంది రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా గ్రీవెన్స్‌కు 17 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణాలాల్, ఏవో శివలింగం, ఏసీపీ వసుందర తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను ఇబ్బంది పెట్టేలా పాలన'


సుందరయ్యనగర్ వాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హామీలను అమలుచేయకుండా ప్రజలను ఇబ్బంది పెట్టేలా పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు విమర్శించారు. ఖమ్మం సుందరయ్యనగర్‌లో రోడ్డు వెడల్పు కోసం మార్కింగ్ చేసిన ఇళ్లను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. హామీలను పక్కదారి పట్టించేందుకు రోడ్డు వెడల్పు పేరుతో పేదల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తోందన్నారు. సుందరయ్య నగర్‌లో ఇప్పుడు ఉన్న 30 అడుగుల రోడ్డు సరిపోతుందని తెలిసినా రోడ్డు వెడల్పు పేరిట మార్కింగ్ చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేయొద్దన్నారు. కేఎంసీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్, కార్పొరేటర్లు ముక్కల కమల, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, తోట ఉమారాణి వీరభద్రం, పసుమర్తి రామ్మోహన్, బుడిగం శ్రీనివాస్, మాటేటి అరుణ నాగేశ్వరరావు, మోతారపు శ్రావణి సుధాకర్, కూరాకుల వలరాజు, డోన్‌వాన్ సరస్వతి రవి, పల్లా రోసిలీనా, పగడాల శ్రీవిద్య, దాదే అమృత, నాయకులు మాటేటి కిరణ్, రాజేష్ ఉన్నారు.

నియామక పత్రాల అందజేత..


కృష్ణకు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ మధు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన కర్నాటి కృష్ణ, ఎస్.కే.మక్బూల్‌కు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు నియామక లేఖలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పార్టీ నగర, రూరల్ మండలాల అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లంవేణు గోపాల్‌తో పాటు కట్టా అజయ్‌కుమార్, రుద్రగాని ఉపేందర్, మాటేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్లతో కలిసి లేఖలను సోమవారం బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు అందజేశారు. కార్పొరేటర్లు బుడిగం శ్రీనివాస్, నాగండ్ల కోటి, దాదే అమృత, పల్లా రోసిలీనా, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, దొన్వాన్ సరస్వతి రవి, కూరాకుల వలరాజు, పగడాల శ్రీవిద్య, తోట ఉమారాణి వీరభద్రం, రామ్మోహన్, బుర్రి వెంకట్, దండ జ్యోతిరెడ్డి, ముక్కాల కమల, నాయకులు రామారావు, నాగేశ్వరరావు, సుధాకర్ ఉన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త వహించండి


మాట్లాడుతున్న రుత్విక్‌సాయి

ఖమ్మంఅర్బన్: సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలపై జాగ్రత్త వహించాలని ట్రెయినీ ఐపీఎస్ అధికారి రుత్విక్ సాయి అన్నారు. సోమవారం నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులను ఆందోళనకు గురిచేయటానికి సైబర్ నేరస్తులు ఒత్తిడి చేస్తారని, చట్టాన్ని అమలు చేసే వారు ఎప్పుడూ డబ్బు డిమాండ్ చేయరన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే సమాచారం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా స్కాం జరిగినట్లయితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ భానుప్రకాశ్, కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల ధర్నా

కూసుమంచి: పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ రాయల వీర స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపొంగు మల్లేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నెల్లూరి కోటమ్మ, కృష్ణకుమారి, నందిని, సుగుణ, రాణి, రాములమ్మ ఉన్నారు.

రాజకీయ జోక్యాన్ని నివారించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: సంక్షేమ పథకాల కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో రాజకీయ జోక్యాన్ని నివారించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎండీఓలకు వినతిపత్రం అందజేశారు. కాంపాటి శ్రీదేవి, సుగుణమ్మ, పులకాని వెంకట నరసయ్య, పాపిట్ల సత్యనారాయణ, పప్పుల ప్రసాద్, మోర ఉపేందర్ రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

చేయూతనివ్వడం అభినందనీయం


మాట్లాడుతున్న పుల్లయ్య

ఖమ్మంరూరల్: పేద విద్యార్థుల చదువుకు చేయూతనిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని దానవాయిగూడెం కళాశాల ప్రిన్సిపాల్ తుమ్మల విజయదుర్గ అన్నారు. పీ.వీ.నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థిని హారికకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ వారు ఆర్థిక చేయూతను సోమవారం అందజేశారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య మాట్లాడగా అధ్యాపకులు షేక్ రేష్మాభాను, రంగారావు, ప్రవీణ, మేఘన, భాస్కర్‌రావు, ఎల్లయ్య, సురేష్, రామయ్య పాల్గొన్నారు.


రసాభాసగా 'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

నేలకొండపల్లి: మండలంలోని ఆచార్లగూడెంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభ రసాభాసగా మారింది. స్పెషల్ గ్రామంలో నిర్మించిన 18 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమేష్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారులు సిద్ధం చేసిన అర్హుల జాబితాను ప్రకటించగా స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇంకా గ్రామంలో అర్హత ఉన్న వారు చాలా మంది ఉన్నారని వారికి కూడ ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చొరవ తీసుకుని వారితో ప్రత్యేకంగా చర్చించారు. వీరికి మిగిలిన స్థలాలను కేటాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీఓ శివ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీ.రవి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆర్థికసాయం

ఖమ్మంగాంధీచౌక్: నగరానికి చెందిన కొత్త నాగేశ్వరరావు చికిత్సకు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ బాధ్యులు రూ.10వేలు అందజేశారు. చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, మురళీకృష్ణ ఉన్నారు.

దుకాణాల తొలగింపు


దుకాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్, రోటరీనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంట ఏర్పాటు చేసిన వివిధ దుకాణాలను సోమవారం కార్పొరేషన్ అధికారులు తొలిగింపు చేపట్టారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య వీధి వ్యాపారుల ప్రాంగణం పరిశీలించి రోడ్లపై వ్యాపారాలను బంద్ చేయాలని ఆదేశించగా వివిధ రకాల దుకాణాలు, బండ్లు తొలగించి వీధి వ్యాపారుల సముదాయంలోకి తరలించారు. వాటితోపాటు ఇందిరానగర్ బైపాస్‌రోడ్డులో ఉన్న శ్మశానవాటిక వద్ద చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలు దుకాణాలను సైతం తొలగించారు.

'సాక్షి' స్పెల్ బీలో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సాక్షి స్పెల్ బీ కేటగిరి–3 రీజినల్ స్థాయి పోటీల్లో తమ విద్యార్థి ఓ.ఆర్యన్ షణ్ముఖ శ్రీరామ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు రెజొనెన్స్ శ్రీనగర్ డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థిని అభినందించారు.

రక్షణ చట్టంలో సవరణలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దిలీప్

ఖమ్మం లీగల్: న్యాయవాద రక్షణ చట్టంలో కొన్ని సవరణలు చేపట్టాలని న్యాయవాది తాళ్లూరి దిలీప్ కోరారు. లా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా న్యాయవాద రక్షణ చట్ట ప్రతిలో సలహాలు, సూచనలు కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం లా సెక్రటరీ తిరుపతికి వినతిపత్రం సమర్పించారు. న్యాయవాదులపై దాడి చేస్తే వేసే శిక్ష పెంచాలని, సత్తుపల్లి అదనపు జిల్లా కోర్టు లో గవర్నమెంట్ ప్లీడర్ పోస్ట్‌ను కేటాయించాలని, ఖమ్మం సెషన్స్, సబ్ కోర్ట్‌కు ఒక అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్ట్ ని కేటాయించాలని కోరారు. పసుపులేటి శ్రీనివాస్ ఉన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

కూసుమంచి: పథకాల కోసం మంగళవారం నుంచి 24 వరకు పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలు విజయవంతం చేయాలని ఎంపీఓ శ్రీలత సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణ శ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్, ఏపీఓ అప్పారావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నేలకొండపల్లి: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండలంలోని ఆచార్లగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. మార్కెట్ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వెంకన్న, పెద్ద మైసయ్య, సుబ్బారావు, వెంకట్రామయ్య, రామయ్య, చంద్రశేఖర్, భూచక్రవర్తి ఉన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: రైల్వే మూడో లైన్ విస్తరణలో భాగంగా రైల్వే నిధులతో చేపడుతున్న డ్రెయినేజీని కేఎంసీ ఈఈ కృష్ణాలాల్ సోమవారం పరిశీలించారు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇళ్లను పేదలకు ఇవ్వాలి


ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాజీవ్ స్వ గృహకల్ప ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో రాజీవ్ స్వగృహకల్ప ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవనాలు కట్టి 20 ఏళ్లు కావస్తున్నా నిధులు విడుదల చేయకుండా గత ప్రభుత్వం అడ్డుకుందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చేసి, రాజీవ్ గృహ కల్ప పనులను పూర్తి చేసి తక్షణమే పేదలకు ఇవ్వాలన్నారు. త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనెశేఖర్, జ్వాలా నర్సింహారావ్, రెహమాన్, శేఖర్‌నాయక్, చానా, మొహమ్మద్ రఫీ, అదిల్, అతిక్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు క్రీడాపోటీలు

ఖమ్మం లీగల్: రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో న్యాయవాదులకు జిల్లా న్యాయవాదుల సంఘం సోమవారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కొప్పుల కృష్ణ జట్టు ప్రథమ బహుమతి, గరిక సంపత్ జట్టు ద్వితీయ బహుమతి సాధించాయి. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా తన్నీరు పాపయ్య, గుండ్ల వీరభద్రం, పువ్వాడ రంగారావు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, స్పోర్ట్స్ సెక్రటరీ యుగంధర్, లేడీ రిప్రజెంట్ తన్నీరు లలిత తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కూసుమంచి: రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా సోమవారం కూసుమంచిలోని సమీకృత వసతి గృహంలో విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగి ప్రాణాలు కోల్పోతున్నందున ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులకు వివరించారు. ఏఎంవీఐలు స్వర్ణలత, గోపీకృష్ణ, సుమలత, కానిస్టేబుళ్లు రమేష్, లక్ష్మీ, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి సిగ్గుచేటు

రంగారెడ్డి జిల్లా, తుక్కగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేయటం సిగ్గుచేటని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, ఉపాధ్యాయులు అన్నారు. దాడికి వ్యతిరేకంగా పలు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు.

– నేలకొండపల్లి, కామేపల్లి, ఖమ్మం సహకారనగర్


ఖమ్మం సహకారనగర్: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయుల సంఘం నాయకులు


నేలకొండపల్లి: బోదులబండ పాఠశాలలో..


కామేపల్లిలో..